మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# సిద్దిపేట రవాణాశాఖ కార్యాలయంలో ఏసిబి అధికారుల తనిఖీలు



జిల్లా కేంద్రంలోని రవాణా కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాల తనిఖీల్లో భాగంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమీపంలో వాహనంలో వచ్చిన ఏసీబీ అధికారులు కార్యాలయంలో తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోకి ఎవరూ రాకుండా గేట్‌కు తాళం వేయించిన తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఏజెంట్లు వారి వారి కార్యాలయాలను మూసివేసుకొని వెళ్లిపోయారు. కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయడంతో వినియోగదారుల సేవలు నిలిచిపోయాయి .

## అదనపు కలెక్టర్‌ను ఘెరావ్ చేసిన రైతులు

**కల్హేర్, మే 28ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టరు మాధురి కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కేంద్రానికి తనిఖీ చేసేందుకు వచ్చింది. మంగళవారం బీబీపేటలో జొన్నల కొనుగోలు తనిఖీకి వచ్చిన సందర్భంగా అదనపు కలెక్టరు మధురి వాహనాన్ని రైతులు అడ్డుకుని ఘోరావ్ చేశారు. జొన్నల కొనుగోళ్లలో జాప్యం పట్ల రైతులు కన్నెర్ర చేశారు. కొనుగోలు చేసిన జొన్నలను తిరిగి వెనక్కి పంపడం వల్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జొన్నల కొనుగోళ్ల తేదిని పెంచాలని రైతులు డిమాండ్ చేశారు.

## మైనర్లను బెదిరించిన నలుగురికి రిమాండ్

**పాపన్నపేట, మే 28, ప్రభాతవార్త:** ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చిన మైనర్లను బెదిరించి ఫోన్‌లను బెదిరించి ఎత్తుకెళ్లిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు, ఇద్దరు బాలికలు ఈ నెల 25న ఏడుపాయలకు చేరుకుని వనదుర్గా భవాని మాతను దర్శించుకుని ఆలయ సమీపంలోన ఘనపురం ఆనకట్ట వద్ద సేదతీరుతుండగా అటుగా వచ్చిన 4గురు వ్యక్తులు మైనర్లను బెదిరించి మైనర్ల వద్ద ఉన్న 3 ఫోన్‌లను తీసుకుపోయారు. సోమవారం ఓ మైనర్ బాలిక తల్లి పోలీసు ఠాణాలో ఈ విషయమై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును నమోదు చేసి విచారణ నిర్వహించగా నాగ్సాన్‌పల్లికి చెంఇన గారంగుల యాదగిరి, ఆలకుంట్ల పోచయ్య, చకలి రవీందర్, చిన్న ఘనపూర్ గ్రామానికి చెందిన వడ్డె నర్సింలులు మైనర్ నుంచి ఫోన్లు దోచుకున్నారని గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని ఫోన్‌లను స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. రిమాండ్‌కు తరలించిన నిందితుల్లో యాదగిరి, పోచయ్యలపై గతంలో సైతం పలు కేసులు నమోదయినట్లు ఎస్ఐ వివరించారు.

# సరైన తేమశాతం ఉన్నప్పుడు ధాన్యాన్ని మిల్లులకు పంపాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

**సంగారెడ్డి బ్యూరో, మే28 ప్రభాతవార్త:**
సరైన తేమశాతం ఉన్నప్పుడు ధాన్యాన్ని మిల్లులకు పంపాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తేమ శాతం కరెక్ట్‌గా ఉన్నప్పుడు మాత్రమే అటువంటి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని చెప్పారు. రవాణా సంబంధిత విషయాల్లో లారీల కొరత లేదని, ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే ఆరబోసి కూలీలతో ధాన్యానినన తిరగబోత ప్రక్రియ చేయడం ద్వారా అనుకున్న తేమ శాతం లభ్యమవుతుందని, తద్వారా కొనుగోలు ప్రక్రియ సులభతం అవుతుందని, రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని వివరించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు అధికారులు కొనుగోలు కేంద్రాల సమస్యల సమాచారాన్ని వాట్సాప్ ద్వారా తెలుసుకొని చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు అహర్నిషలు కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రం అధికారులు, మండల అగ్రికల్చర్ అధికారులు, మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.కార్యక్రమంలో శివ్వంపేట తహాశీల్దార్ శ్రీనివాసులు, ప్యాక్స్ సీఈవో మధు, ఇందిరా క్రాంతి పథకం సీసీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

# జూన్ 9న నిర్వహించే పరీక్షకు 21 కేంద్రాలు

**-8239 మంది అభ్యర్థులు పరీక్షా రాయనున్నారు**
**- జిల్లా కలెక్టర్ మను చౌదరి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాలలో జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్షలో 8239 మంది అభ్యర్థులు పరీక్షా రాయనున్నారని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం టిజిపిఎస్‌సి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో భాగంగా డిపార్ట్‌మెంట్ అఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పరీక్ష నిర్వహణకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మొబైల్ ఫోన్లు అనుమతి లేదని ఇన్విజిలేటర్లు సైతం గేట్ బయటనే పెట్టాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని 10 తర్వాత గేట్‌లు మూసి వేయాలన్నారు. సెంటర్‌లోకి ఎవరెవరు అలర్ట్ అయిన అభ్యర్థుల వివరాలు మాత్రమే బయోమెట్రిక్ టాబ్‌లో ఉంటాయని పరీక్ష రాసే అభ్యర్థి కాకుండా వేరు వ్యక్తి వస్తే టాబ్‌లో బయోమెట్రిక్ రాదన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు చేతికి మెహంది ఉంటే బయోమెట్రిక్ అటెండెన్స్‌లో సాంకేతిక సమస్యలు వస్తాయని చేతికి మోహంది లేకండా చూసుకోవాలన్నారు. బంగారు అభరణాలు, వెండి చైన్లు ఉంటే ఇంటి వద్దనే పెట్టి రావాలని లోనికి అనుమతి ఉండదన్నారు. అర్టీసి అధికారులు ప్రత్యేక బస్సులు నడుపాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో టిజిపిఎస్‌సి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ విజయవంతం చేసేలా చూడాలన్నారు.

## కేంద్రీయ విద్యాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సమీపంలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం భవనాన్ని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ రాజేశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి తక్కువ సమయం ఉన్నందున భవన నిర్మాణంలో పూర్తి చేయాల్సిన పనులు త్వరగా పూర్తి చేయాలని అదేశించారు. విద్యాలయం అవరణలో చుట్టూ అటస్థలం కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. పాఠశాల అవరణలో ఉన్న బావిని పూడ్చడానికి, మెయిన్ గేట్ వద్ద విద్యుత్ వైర్లు తగలకుండా ఎత్తు స్థంబాన్ని ఏర్పాటు చేయడానికి 250 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. అయన వెంట విద్యుత్‌శాఖ డీఈ మహేష్, తహశీల్దార్, పంచాయతీరాజ్ ఏఈ తదితరులు ఉన్నారు.



కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

# వేసవి దుక్కులతో పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు



అలిరాజపేటలో వేసవి దుక్కులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**జగదేవ్‌పూర్, మే 28 (ప్రభాతవార్త):**
రైతులు వేసవి కాలంలో దుక్కులు దున్నుకోవడం వల్ల పంటలలో వచ్చే పురుగుల ఉధృతిని తగ్గించవచ్చని ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్, డాక్టర్ పల్లవిలు అన్నారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో మంగళవారం ఏరువాక వ్యవసాయ పరిశోధన సంస్థ తోర్నాల శాస్త్రవేత్తలు రైతులకు వేసవి దుక్కులు, మట్టి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో దుక్కులు దున్నుకున్నట్లయితే భూమి లోపల పొరలోని నీరు ఆవిరి అయిపోతుందని, ఖాళీ భూముల్లో చీడపీడల ఉధృతి ఎక్కువై పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని, అందువల్ల ప్రతి రైతు వేసవిలో దుక్కులను లోతుగా దున్నుకోవాలని, దీనివల్ల భూమిలో ఉన్న పురుగుల ప్యూపాలు నశించిపోతాయని, అదేవిధంగా తొలకరి వర్షాలు పడగానే మట్టి పెల్లలు మెత్తబడతాయని, పడిన వర్షం నేలలోకి ఇంకి సాగుకు సులభతరమవుతుందన్నారు. ప్రతి రైతు కూడా పంట భూములను ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పరీక్షలు నిర్వహించుకోవాలని, ఈ మట్టి పరీక్షల వల్ల భూమిలో వివిధ రకాల పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో తెలుసుకొని అవసరమైన పోషకాల సమృద్ధికి ఎరువులను వాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు, ఏఈఓలు శరణ్య, మమత, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్...310 లీటర్ల డిజిల్ రికవరి

**కొండపాక, మే 28, ప్రభాతార్త**
అంతర్ రాష్ట్ర డిజిల్ దొంగల ముఠాను పట్టుకున్న కుకునూరుపల్లి పోలీసులు. మంగళవారం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఎసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మహరాష్ట్రకు చెందని 4గురు, రంగరెడ్డి జిల్లాకు చెందని ఒక్కరు కలిసి ముఠాగా ఏర్పాడి డిజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నారని వివరించారు. రాత్రి వెళల్లో రోడ్ల ప్రక్కన, పెట్రోల్ బంకుల్లో నిలిపి ఉంచిన లారీల నుండి డిజిల్ ట్యాంకులు పగులగొట్టి డిజిల్ దొంగిలిస్తున్నట్లు అయన తెలిపారు. ఈ నెల 15న వెలకట్ట క్రాస్ రోడ్డులోని ఇండియన్ అయిల్ పెట్రోల్ బంకులో తన లారీని అపుకొని నిద్రిస్తుండగా తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనం నుండి డిజిల్ ట్యాంకు పగుల గొట్టి డిజిల్ దొంగిలించినట్లు గోపి అనే లారీ డ్రైవర్ కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని సిపి అనుమతితో దొంగల ముఠాను పట్టుకొవడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ముఠాగా ఏర్పాడ్డ 5 గురు వ్యక్తులు మొత్తం మూడు వాహనాల నుండి 720 లీటర్ల డిజిల్ దొంగలించినట్లు తెలిపారు. అదే విధంగా జగదేవ్‌పూర్‌లో నుండి 3 వేల లీటర్ల డిజిల్ దొంగిలించినట్లు తెలిపారు. ఈ దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకొన్న తొగుట సిఐ ఎస్ కె లతిఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది ఎస్. రమెష్, బి.రాజులను ఎసిపి అభినందించారు. త్వరలోనే సిసి చేతుల మిదుగా రివార్డును అందిస్తామని తెలిపారు. నిందితుల నుండి 310 లీటర్ల డిజిల్‌ను, రూ॥ 22 వేల నగదు, ఒక డిసిఎం వాహనం, ఒక బోలేరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



కుకునూరుపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న గజ్వేల్ ఎసిపి పురుషోత్తంరెడ్డి

# కంకర్ మిషన్‌ను ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదు

**చిన్నశంకరంపేట,మే28,ప్రభాతవార్త:**
తమ తండా శివారులో కంకర్‌మిషన్ ఏర్పాటు చేస్తే రాస్తారోకో చేయడానికి సిద్ధంగా ఉన్నామని చిన్నంకరంపేట మండలం కామారం తండా వాసులు మంగళవారం అధికారులకు తెలిపారు. మనోహర్‌బాద్ మండలం ముప్పిరెడ్డి పల్లికి చెందిన అనంతరెడ్డి తమ తండా శివారులో కంకర్ మిషన్ పెట్టడానికి ప్రయత్నాలు చేస్తునాడని, ఇప్పటికే అక్కడ ఉన్న గుట్టలను బాంబులతో పెల్చి తండా వాసులను భయబ్రాతులకు గురిచేశారని తెలిపారు. భారీ శబ్దాలకు వన్యప్రాణులు సైతం మరనించాయని అన్నారు. వన్యప్రానులకు ఆసరగా ఉండే సూరప్ప చెరువును అనంతరెడ్డి తన బండరాల్లతో నింపి చెరువు ఆనవాల్లు లేకుండా చేశారని అన్నారు. గతంలో కామారం తండా నుండి మిర్జాపల్లి తండా శివారు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎన్‌వోసికి గ్రామ పంచాయాతీకి దరకాస్తు చేశాడని , అతనికి ఎన్‌వోసి ఇవ్వడానికి తండావాసులం సిద్దాంగా లేమిన తేల్చి చెప్పారు. ఉన్నత అధికారుల చోరవతో కంకర్‌మిషన్‌ను ఏర్పాటు చేస్తే తండా వాసులం భారీ ఎత్తున్న రాస్తారోకో చేస్తామన్నారు. అధికారుల తండాకు వచ్చి పరిశీలించి అనంతరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహీసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంటీసీ సభ్యురాలు సక్కుబాయ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ, రేవంతన్న ఫోరం రాష్ట్ర అధ్యక్ష్యుడు మోహన్ నాయక్, రవిచంద్ నాయక్, సక్రు నాయక్, గనేష్ నాయక్, రవిందర్ గోపాల్, చెన్నపతి, రుక్యా, భీమా తదితరులు పాల్గొన్నారు.

# జీలుగ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

**-విత్తనాలు అందుబాటులో లేక రైతుల నిరాశ**



దుబ్బాక అగ్రోస్ కేంద్రం వద్ద జీలుగ విత్తనాల కోసం క్యూలైన్‌లో బారులు తీరిన రైతులు

**దుబ్బాక, మే 28, ప్రభాతవార్త :**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవ కేంద్రం ముందు మంగళవారం రైతులు జీలుగా విత్తనాల కోసం ఉదయం నుంచి క్యూలైన్‌లో నిలబడి బారులు తీరారు. విత్తనాల కోసం రైతుల గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిన సరిపడా జీలుగా విత్తనాలు దొరకకపోవడంతో తీవ్ర అవేదనకు గురయ్యారు. గంటల తరబడి తిండి తిప్పలు లేకుండా క్యూలైన్‌లో నిలబడిన తర్వాత విత్తనాలు అందుబాటులో లేవని చెప్పడంతో రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. విత్తనాల కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడితే జీలుగా విత్తనాలు లేవని అగ్రోస్ కేంద్రం ప్రతినిధులు చెప్పడం సరికాదన్నారు. గత మూడు రోజుల నుంచి విత్తనాల సరఫరా లేదని రైతులు వాపోతున్నారు. అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగానే రైతులకు సరిపడా జీలుగా విత్తనాలు అందుబాటులో లేవని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. జీలుగా విత్తనాలు మూడు రోజుల నుంచి సరఫరా లేకపోవడంతో రోజు వారిలాగేనే రైతులు విత్తనాలు కోసం బారులు తీరారు. సాగుకు ముందు భూసార పెంపు కోసం రైతులు జీలుగా సాగు చేస్తారు. జీలుగ సాగు చేయడంతో పంట అధిక దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. దుబ్బాక వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా స్టాక్ రాలేదని తెలిపారు. స్టాక్ లేనందున రైతులు క్యూలైన్‌లో నిల్చున్నారని తెలిపారు. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అందోలులో ఘనంగా రంగనాథస్వామి కళ్యాణోత్సవం

**-పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**



రంగనాథస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, మే28, ప్రభాతవార్త:**
అందోలు లోని శ్రీ భూనీళా సమే రంగనాథ స్వామి, శ్రీ రుక్మిణ-సత్యభామ సమేత మురళీక్రిష్ణ స్వామి వార్ల కళ్యాణోత్సవంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆయన కూతురు త్రిషలు పాల్గొన్నారు. ఈ నెల 25న ప్రారంభమైన రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారంనాడు నిర్వహించిన స్వామి వార్ల కళ్యాణోత్సవంలో మంత్రి దామోదర్, కూతురు త్రిషలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికి, ఆలయ మర్యాదలు చేపట్టారు. ముఖ్యంగా ఈ ఆలయానికి సంబంధించిన విగ్రహాలను ఈ సంవత్సరమే ఇక్కడకు తెప్పించి బ్రహ్మోత్సవాలు నిర్వహించటంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషి విశేషమైనదని ఆలయ పూజారి శ్యామ్ తెలిపారు. ఈ కళ్యాణోత్సవంలో పుర ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులతో పాటు అందోలు, జోగిపేటలతోపాలు చుట్టుపక్క గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ జనరల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆనందకుమారరాజ

**పెద్దశంకరంపేట, మే28 ప్రభాతవార్త:**
ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉ ండాలని ఎస్‌బీఐ జనరల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆనందకుమారరాజ అన్నారు. మంగళవారం ఎస్‌బీఐ శాఖలో ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు తమ వ్యక్తిగత వివరాలపై గోప్యత పాటిస్తూ జాగ్రత్త పడాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో ఎవరు ఎలంటి వివరాలు అడిగిన చెప్పకూడదని, ఖాతాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా బ్యాంకు సిబ్బందిని కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అపరిచితులకు సెల్‌ఫోన్లు ఇవ్వడం, వాట్సాప్‌లో అనవసర లింక్‌లను ఓపెన్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌దోస్త్ ద్వారా పూర్తి అవగాహన పొందాలని, సైబర్ మోసాలు ఎదురైనప్పుడు వెంటనే 1930 నెంబర్‌ను సంప్రదించి జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్ కుమార్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 2 వేల సంచులకు 150 బస్తాలు సరఫరా

**-కంది సొసైటీలో రైతుల ఆందోళన**

**కంది, మే 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలోని సొసైటీ పరిధిలోని రైతులకు జిలుగ విత్తనాలు అవసరానికి సరిపడా సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. వర్షాకాలం వరి పంటల సాగుకు ముందస్తుగా జనుములు, జీలుగ విత్తనాలు నాగు కోవడం అవసరమని రైతులు పేర్కొన్నారు. సొసైటీ పరిధిలోని రైతులకు 2వేల బస్తాల విత్తనాలు అవసరం ఉండగా అధికారులు కేవలం 150 బస్తాలను సరఫరా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా కాకపోవడంతో తాము నానా ఇబ్బంద పడాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవంలోఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**కొల్చారం, మే28 ప్రభాతవార్త:**
కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, పూజా కార్యక్రమాలు చేసిన అంనతరం కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాఉ. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి వారి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## విధులు సక్రమంగా నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవు

**-ఇజిఎస్ సోషల్ ఆడిట్‌లో అడిషనల్ డిఆర్‌డివో బాలరాజు**

**జోగిపేట, మే28, ప్రభాతవార్త:**
ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని అడిషనల్ డిఆర్‌డివో బాలరాజు అన్నారు. మంగళవారం నాడు ఎంపిడివో కార్యాలయంలో ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్లు, మిగతా అధికారులు, సిబ్బందితో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు జరిగిన పొరపాట్లు ఇకముందు జరగకుండా చూసుకోవాలన్నారు. అందరూ తమ విధులు సక్రమంగా నిర్వహిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అంతకుముందు ఆయన డాకూరు గ్రామంలోని నర్సరీని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాజేశ్ కుమార్, ఏపివో అర్చన, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట,మే28,ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి చెందిన సంఘటన మండలంలోని మిర్జాపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పోతురాజు సుభాష్(45) సోమవారం చేపల వల తీసుకోని చేపలను పట్టడానికి గ్రామ శివారులోని పిన్‌చెరువుకు వెల్లాడు. ఉదయం ఆయిన అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెల్లి చూడగా చెరువు ఒడ్డుపై సుభాష్ లుంగి కనిపించింది. గ్రామస్థులు చెరువులో గాలించగా చేపల కోసం వేసిన వలలో సుభాష్ చిక్కుకోని మృతి చెందాడు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట,మే28,ప్రభాతవార్త:**
ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సూరారంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సురేష్(30) కూలీ పనులు చేసుకుంటూ భార్య స్వప్నను పోశిస్తున్నాడు. గత కోంత కాలంగా కూలీ పనులకు వెల్లకుండా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సురేష్ గడ్డిమందును తాగగా కుటుంబసభ్యులు గాందీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పోందుతూ సురేష్ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

**జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండంలోని హోతి(కె) గ్రామ శివారులో చోటుచేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ వరప్రసాద్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆనెగుంట రగామానికి చెందిన పెద్దగొల్ల వెంకటేశ్ (30) నిజాంబాద్ జిల్లా బాల్కొండ గ్రామానికి చెందిన యువతితో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పరిచయం అయి రాను రాను ఇద్దరు ప్రేమలో పడిపోయారు. ప్రేమించిన యువతని పెళ్లి చేసుకునేందుకు అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడగా అమ్మాయి కుటుంబ సభ్యులు వారి ప్రేమను నిరాకరలించి పెళ్లికి నో అన్నారు. పెళ్లికి అమ్మాయి కుటుంబ సభ్యులు కాదనడంతో యువకుడు వెంకటేశ్ మంగళవారం ఉదయం హోతి(కె) గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తండ్రి జగన్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# కోడ్ ముగియగానే ..బదలీలు ..!

-విద్యుత్‌శాఖలో ఏఈ నుంచి సిజిఎంల వరకు భారీగా మార్పులు
-సర్కిళ్ల వారీగా జాబితా సిద్దం చేస్తున్న ఉన్నతాధికారులు
-ఫోకల్ స్థానాలు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నాలు
-మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తున్న యూనియన్ నేతలు
-గ్రేటర్‌లోనివారిని జిల్లాలకు ... జిల్లాల నుంచి ఇక్కడికి మార్చే అవకాశం




**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
విద్యుత్‌శాఖలో ఉదో గ్యగబదిలీల ప్రక్రియపై డిస్కం దృష్టి సారించింది. ఎన్నికల కోడ్ ముగియగానే భారీగా బదిలీలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డివిజన్, సర్కిళ్ల వారీగా ఒకే స్థానంలో ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు మూడేళ్ల దాటివారి జాబితాను సిద్దం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ జోన్‌లోని సైబర్‌సిటీ, మేడ్చల్, రాజేంద్రనగర్, హైదరాబాద్ సౌత్, సెంట్రల్, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో భారీగా ఉద్యోగ బదిలీలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో కొంతమందిఅసోషియేషన్లు, యూనియన్ నాయకులు తమకు సంబంధించిన ఉద్యోగులకు తాము సూచించిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు కల్పించాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు తమకు అనుకూలమైన మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. ముఖ్యంగా ఇప్పటికే ఫోకల్ (ఎక్కువ ఆదాయం) ప్రాంతాల్లో పనిచేస్తున్న యూనియన్ నేతలు అక్కడి నుంచి బదిలీ కాకుండా ఉండేందుకు ప్రభుత్వ పెద్దలను కలుస్తున్నారు. అలాగే ఇప్పటివరకు జిహెచ్‌ఎంసి పరిధిలోకి రాలేకపోయిన ఉద్యోగులు, ఇంజనీర్లు ఈప్రభుత్వంలోనైనా ,గ్రేటర్ పరిధిలో పోస్టింగ్ దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో మింట్‌కాంపౌండ్‌లోని యూనియన్, అసోషియేషన్ల కార్యాలయాలల్లో జిల్లాలనుంచి వచ్చే ఉద్యోగులు,నాయకులతో సందడిగా మారుతునా న్నయి.

**ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి..**
నగరంలోని పలు సర్కిళ్లు, డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. ఉద్యోగుల పనితీరు సరిగ్గా లేకుంటే చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టివిక్రమార్క ఇప్పటికే పలుసార్లు హెచ్చరించారు. నిరంతర విద్యుత్ కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా గత ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగిన పలువురు ఇంజనీర్లు, యూనియన్ నాయకులు తమ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తించారు. తాము ఎన్నిసార్లు హెచ్చరించినా వారితీరు మారకపోవడంతో ఎలాగైనా వారికి స్థాన చలనం జరిపించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. డిస్కంలో కొంతమంది అధికారులు ఒకే సర్కిల్, ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఓడివిజన్‌లో గత నెలలో ఓడిఈ పదవి విరమణ చేయగా, ఆస్థానంలో సిజిఎం ఎస్‌ఈ కార్యాలయంలో పనిచేసే అధికారికే ఇన్‌ఛార్జ్ బాద్యతలు అప్పగించడంపై పలువిమర్శలు వ్యక్తమయ్యాయి. అలాగే రాజేంద్రనగర్, సైబర్‌సిటీ పరిధిలోనూ పలువురు అధికారులు యూనియన్ల అండదండలతో భారీగా అవినీతికి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**గ్రేటర్‌నుంచి జిల్లాలకు ...అక్కడి నుంచి ఇక్కడికి**
గ్రేటర్‌లో భారీగా బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగుల పనితీరుదృష్టిలో పెట్టుకుని జిల్లాల నుంచి గ్రేటర్‌కు, గ్రేటర్‌లో పనిచేస్తున్న అధికారులకు జిల్లాకు బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. శివారుప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులపై తరుచూ ఫిర్యాదులు అందుతుండటంతో వారిని పూర్తిస్థాయిలో స్థానచలనం చేయాలని డిస్కం అధికారులు భావిస్తున్నారు. అలాగే టిఎస్‌ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో ఓఅండ్‌ఎం సిబ్బంది, సబ్ ఇంజనీర్లు, సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సూపరింటెంట్ ఇంజనీర్లను ఇతర సర్కిల్ పరిధిలోకిబదిలీలు చేసే అవకాశాలున్నాయి.. అయితే నగరంలో విద్యుత్‌పంపిణీ వ్యవస్థ... గ్రామాల్లో పంపిణీ వ్యవస్థకు తేడా ఉండటంతో ఒక్కసారిగా జిల్లాలనుంచి గ్రేటర్ జోన్‌కు ఉద్యోగులను బదిలీ చేస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని సీనియర్ అధికారులు తెలుపుతున్నారు. యూనియన్లు, అసోషియేషన్ల ప్రాధాన్యం లేకుండా సీనియార్టీ ఉద్యోగుల పనితీరు ఆధారంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

## పరిశుభ్రత పాటించకపోతే ఆరోగ్య సమస్యలు : డాక్టర్ మనోజ్‌రెడ్డి హెచ్చరిక

**సైఫాబాద్, మే 28 ప్రభాతవార్త :**
మహిళలకు ప్రతి నెల వచ్చే పీరియడ్స్ వస్తుంటాయని వాటిపై అవగాహనలేక ఆనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని సుల్తాన్ బజార్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. రుతుక్రమం సగటున 28 రోజులు ఉంటుందని, సాధారణంగా ఐదు రోజులు అవుతుందని, అందుకే ఏడాదిలో ఐదో నెలలోని 28వ రోజు రుతు పరిశుభ్రత దినం గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రుతుక్రమంలో పరిశుభ్రతను పాటించకపోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తుం టాయని, ఈస్ట్ ఇన్‌ఫెక్షన్‌ల నుంచి యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ల వరకు రుతుక్రమ పరిశుభ్రతతో సంబంధం ఉన్న కొన్ని ప్రమాదాలు ఉన్నాయని ఆయన వివరించారు. రుతు పరిశుభ్రతను నిర్వహించడానికి అపరి శుభ్రమైన శానిటరీ ప్యాడ్‌లు, శానిటరీ ప్యాడ్‌లు వివిధ కవర్‌లలో వస్తుంటాయని అందువల్ల మంచివి మాత్రమే వాడాలని, ధర తక్కువగా ఉన్నవాటిని ఎంచుకోరాదని, నాణ్యమైన వాటిని మాత్రమే వినియోగిం చాలని సూచించారు. మహిళలు ప్రతి 6, 8 గంటలకొకసారి ప్యాడ్‌లను మార్చుకొకపోతే శరీరంలో దద్దుర్లు, యోనిలో ఈస్ట్ ఇన్‌ఫెక్షన్‌లకు గురవుతారని హెచ్చరించారు. ప్యాడ్‌లు ధరించే ముందు, ఆ తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని ఆయన సూచించారు.

## సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలి : టిపిసిసి నేత గోనె సాల్మన్‌రాజ్

**చిక్కడపల్లి, మే 28 ప్రభాతవార్త:**
సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నేత గోనె సాల్మన్‌రాజ్ అన్నారు. ప్రముఖ సంఘసేవకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుర్రం శంకర్ అభినం దన సత్కార కార్యక్రమం మంగళవారం జవహరనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేత జానకీ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, శ్యామ్ మూదిరాజ్, భాస్కర్‌రెడ్డి, శ్యామ్ మూదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ధరల దడ..!



## -మండిపోతున్న కూరగాయలు

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త**
కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ఉత్పత్తి బాగా తగ్గడంతో కాయగూరల ధరలు మండుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. రైతు బజార్లు, వారాంతపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే. ఏ కూరగాయ చూసినా పావుకేజీ ధర రూ.20లు నుంచి రూ. 25లు పలుకుతోంది. సాగు నీరు అందుబాటులో ఉన్న రోజుల్లో కిలో కూరగాయలు రూ.20లు నుంచి రూ.40లు వరకు లభించేవి. ప్రస్తుత హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20లు నుంచి రూ.25లు వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60లు–రూ120లు పలుకుతున్నాయి.

నగరంలో సుమారు 1.5 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలకు ఏడాదికి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం ఉంటాయని అంచనా. నగర పరిసర ప్రాంతాలైన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కూరగాయలు వస్తున్నాయి. స్థానికంగా సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 25 మెట్రిక్ టన్నులు వరకు కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయని అంచనా వేస్తున్నారు. ఆపై అవసరాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల కూరగాయలే దిక్కవుతున్నాయి. కూరగాయల దిగుమతికి రవాణా చార్జీలు, లోడింగ్, అన్‌లోడింగ్, మార్కెటాట్ ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిపి మోపెడు అవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా నెల రోజుల క్రితం టమోటా కిలో రూ. 20 ఉంటే ప్రస్తుతం రూ. 50 చేరింది. గతంలో పచ్చిమిర్చీ కిలో రూ. 60 ఉండగా ఇప్పుడు రూ. 120కి పెరిగింది.పావు కిలో రూ. 20కి అమ్ముతున్నారు.వారపు సంతలో కూరగాయలు ఏవి అడిగినా పావుకిలో రూ. 20 నుంచి రూ. 25 చెబుతున్నారు. నెల క్రితం వరకు కిలో టమాటా రూ. 20 ఉండేది. ప్రస్తుతం కిలో రూ. 60 అమ్ముతున్నారు. పచ్చిమిర్చీ పావుకిలో రూ. 20కి దొరికేది. ప్రస్తుతం రూ. 40కి అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు పెరగడంతో తక్కువ కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు పెట్రోల్ ధరలతో పాటు కూరగాయలు,ఆకుకూరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టమాటా,ఉల్లిగడ్డ డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర పెరిగిపోతోందని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడుతుందని అప్పటి వరకు ధర పెంపు తప్పదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక వ్యాపారులు ఎక్కువగా చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్‌లపై ఆధారపడి అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే అక్కడ పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఇక మన రాష్ట్రంలో పంట సాగు తక్కువగా ఉంది. అది కూడా మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలో మాత్రమే టమాటా సాగవుతోంది. ఈ జిల్లాల నుంచి హైదరాబాద్ మార్కెట్లకు రోజుకు సుమారు 600–800 క్వింటాళ్ల మేర టమాట వస్తుంది. అయితే ఒక్క హైదరాబాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెంచుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు.

# నగర శివారుల్లో వరుస రియల్‌ఎస్టేట్ మోసాలు

-అమీన్ పురా, బందనకొమ్ము ప్రాంతాల్లో మరోసారి -తెలివి మీరిన అక్రమార్కులు కోట్లు కొల్లగొట్టారు

**హైదరాబాద్, మే27, ప్రభాతవార్త:**
నగరంలో వరుస రియలెస్టేట్ మోసాలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భూవిక్రయాల్లో వివిధ రకాలుగా మోసాలకు పాల్పడే నేపథ్యంలో, ఇటీవలె జరిగిన ఘటనలో ఏళ్ళనాటి పాత భూముల నిజమైన యజమానులకు బదులు నకిలీ మనుషులను పురమాయించి డూప్లికేట్ ఆధారాలతో ప్లాట్లను విక్రయించి అడ్డదారిలో దోచుకున్నారు. తాజాగా ఫ్రీలాంచ్ పేరుతో వేల మందిని మోసం చేసి కోట్లు కొల్లగొట్టిన వైనం ఒకే వారంలో రెండు సార్లు చోటు చేసుకుంది. అందులోని ఒక ఘటనలో ఫ్రీలాంచింగ్ పేరుతో దాదాపు 2వేల మందిని పైగా మోసం చేసి రూ.1,500కోట్లు దోచేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ బోర్డు తిప్పేసింది. దాంతో బాధితులు బషీర్‌బాగ్ సీసీఎస్ ఆఫీసు ముందు ఆందోళనకు దిగి తమ గోడు పోలీసులకు వినిపించారు. ఈ భారీ మోసాన్ని నగర ప్రజలు మరువకముందే, ఆది జరిగిన వారం లోపే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయమైంది. వరుసగా జరిగిన ఈ రియలెస్టేట్ మోసాలు నగర శివారుల్లో అమీన్ పురా, బంధన కొమ్ము పరిసరాల్లోనే జరగడం గమనార్హం.

**తెలివిమీరిన అక్రమార్కులు:**
రిజిస్టర్ కార్యాలయం వారి నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని తెలివిమీరిన అక్రమార్కులు చాపకింద నీరులా వ్యవహరిస్తూ కోట్లు విలువ చేసే భూములను నకిలీ ఆధారాలతో అమ్మేసిన వైనం ఇటీవలె చోటు చేసుకుంది. తెలంగాణలో భూముల విలువ పెరిగిన నేపథ్యంలో అమీన్ పురా, బందనకొమ్ము, రామేశ్వరం బండ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించిన అక్రమార్కులు, వాటి యజమానులు ఎవరో తెలుసుకుని వారి పేరుతో నకిలీ ఆధార్ కార్డులనూ, నకిలీ పత్రాలనూ, నకిలీ వంశస్థులనూ సృష్టించి స్థలాలను కాజేసి డబ్బు చేసుకుంటున్నారు. నగరానికి చెందిన రియలెస్టేట్ వ్యాపారులు బండి దుర్గాప్రసాద్, సుబ్బారావు, రవీ గౌడ్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ఇద్దరు అమీన్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో గత 20 నుండి 25 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను రెక్కీ వేసి మరీ గుర్తించి, ఆ భూముల అసల యజమానుల వివరాలను పకడ్బందీగా తెలుసుకున్నారు. అనంతరం ముఠాలో మరొక సభ్యుడికి సమాచారం అందించడంతో అతడు రంగంలోకి దిగి, నకిలీ యజమానితో పాటు నకిలీ వంశస్థులను సిద్ధం చేశాడు. అమాయక ప్రజలకు డబ్బాశ చూపించి, వారిని నకిలీ మనుషులుగా నటించమని చెప్పిన రోజు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చి సంతకాలు చేయాలని ఒప్పించి నియమించారు. అసలు యజమాని పేరు మీద నకిలీ ఆధార్ కార్డు, నకిలీ సేల్ డీడ్, లింక్ డాక్యుమెంట్లను తయారు చేసి ఆ స్థలాలు అమ్ముతూ అడ్డగోలుగా సంపాదించారు. ఒక్కో ప్లాట్ విలువా కోట్లలో ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఇలా దాదాపు 15 నుంచి 20 ప్లాట్ల వరకూ ఈ ముఠా అమ్మేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు వీరిపై నిఘా వేసి అరెస్ట్ చేశారు.

**తక్కువ ధరకు ప్లాట్ల పేరుతో మోసం:**
ఫ్రీలాంచ్ పేరుతో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామంటూ దాదాపు 2వేల మందిని మభ్యపెట్టిందో రియలెస్టేట్ సంస్థ. సంగారెడ్డి జిల్లా అమీన్ పురా ప్రాంతంలో సాహితీ శర్వాణీ ఎలైట్ పేరుతో 25 ఎకరాల్లో 32 అంతస్తులతో 10 టవర్లు నిర్మిస్తామని చెప్పి రెండు వేల మంది సామాన్యుల వద్ద సుమారు రూ1,500 కోట్లు వసూలు చేసి మాయమైంది. ఫ్రీలాంచ్ ఆఫర్‌తో తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని చెప్పడంతో ఎంతో మంది ఎగబడడంతో సంస్థను అడ్డు పెట్టుకున్న అక్రమార్కులు డబ్బులు కట్టించుకుని ఉడాయించారు. ఈ మేరకు బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయం ముందు భారీగా మోహరించిన బాధితులు పోలీసులకు తమ గోడు వెళ్ళగక్కుకున్నారు. నిందితుల ఫొటోలను ప్లకార్డులకూ, ఫ్లెక్సీలకూ ప్రింట్ చేయించి ఆందోళనకుదిగారు. ఆది జరిగిన దాదాపు తక్కువ వ్యవధిలోనే మరో ఫ్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో బాధితుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన భోగస్ సంస్థ మూడోకంటికి తెలియకుండా మాయమైంది. ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయకుండా సదరు కంపెనీ మోసం చేసిందని సీసీఎస్ ప్రధాన కార్యాలయం ముందు బాధితులు వాపోయారు. ఇటువంటి రియలెస్టేట్ మోసాలు అధికమవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు అక్రమార్కులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుల ఆదేశాల మేరకు రిజిస్టర్ కార్యాలయ అధికారులు స్థలాల రిజిస్ట్రేషన్ విషయాల్లో అప్రమత్తమయ్యారు.

## రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

-కంపుకొడుతున్న పట్టించుకోని జిహెచ్‌ఎంసి అధికారులు
-నెల రోజుల నుండి పారుతున్న వైనం



**అత్తాపూర్ మే28,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ ,పరిసరాల పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తున్నామని జిహెచ్‌ఎంసి అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికి వాస్తవానికి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. అరంఘర్ చౌరస్తా నుండి మోహిదిపట్నం వెళ్లె మార్గంలోని పిల్లర్ నెంబర్ 251 దగ్గర గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నాలా నిండి రోడ్డుపై పారుతున్న జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు.వివిధ కాలనీల నుండి ప్రవహించే నాలా చెత్తచెదారంతో నిండి డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాగును తలపిస్తుంది. అయిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.దీంతో రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచిపోయి. కంపు కోడుతుండడంతో అటు వైపు ప్రయాణాలు సాగించే వాహనదారులు ముక్కు మూసుకొని ప్రయాణం సాగిస్తున్న పరిస్థితి నెలకొంది.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నాలాను క్లీయర్ చేయించి డ్రైనేజీ నిరు సాఫీగా వెళ్లే విధంగా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హద్దులు దాటిన ఇద్దరి అవినీతి..!

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త :**
విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కందుకూర్, రాజేంద్రనగర్ డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఆ ఇద్దరు అధికారుల అవినీతి, అక్రమ వసూళ్ళు హద్దులు దాటినా ఓ వైపు విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో తమకు అడ్డే లేదన్న ధీమాతో సదరు అధికారులు మామూళ్ళ కోసం రెచ్చిపోతున్నారు. డీఇ, ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో కొందరు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్లు, ప్యానల్ బోర్డుల స్విచ్‌గేర్‌లు, ఎర్త్‌ల మంజూరుకు గాను పెద్దమొత్తంలో మామూళ్ళను వసూలు చేస్తున్నారు. కనెక్షన్ల ఎస్టిమేషన్లలో కొందరు ఏడీఇలు, ఏఇలు కొందరు కీలక అధికారులు గోల్‌మాల్ చేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు, వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొత్తగా విద్యుత్ కనెక్షన్ జారీచేయడంలో జరుగుతున్న అక్రమాలు అంత ఇంతా కావు. ఇక కొత్త కనెక్షన్లకు మరింత గిరాకీ పెరుగుతుంది. అధికారుల వేదింపులు అంతా ఇంతా కావు. అడిగినంత ఇస్తే తప్ప ఎవరు చెప్పినా కొత్త కనెక్షన్ ఇచ్చే పరిస్థితి లేదంటే చెబుతున్నారు. శివార్లలో బహుళంతస్తుల భవనాలతోపాటు వ్యక్తిగత గృహాలు, కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాలను బట్టి మామూళ్ళను నిర్ణయిస్తున్నారు. భవనాలు, అపార్ట్‌మెంట్లలో 4మీటర్లు దాటితే ప్యానల్ బోర్డు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్యానల్ బోర్డు లేకున్నా మామూళ్ళు తీసుకుని మీటర్లు కేటాయించేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డు పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలోని ఓ భవనంలో నాలుగుకు మించి మీటర్లు ఉన్నట్లైతే ప్యానల్ బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వాస్తవానికి ప్యానల్ బోర్డు ఏర్పాటు వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్యానల్ బోర్డు లేకపోవడం వల్ల మీటర్ రీడింగ్ తీసే సిబ్బ ందికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాటు ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. ఈ నిబంధనల్ని ఖచ్చితంగా అమలు చేస్తే బాగుంటుంది. కాని దీన్ని బూచిగా చూపిస్తూ కొందరు మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. ప్యానల్ బోర్డుల పేరిట కొందరు అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో లంచాలను దండుకుంటున్నారు. నాలుగు మీటర్లకు మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల్ని వర్తింపచేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్ళ కోసమే ఈ విధంగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తుంది. మామూళ్ళు ముట్టచెబితే వారికి మాత్రం ఈ నిబంధన వర్తింపచేయడంలేదు. మామూళ్ళు ఇవ్వని వారికి మాత్రం ప్యానల్ బోర్డును ఏర్పాటు చేసుకుంటేనే కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా డీఇలు, ఏడీఇలు, ఏఇలు తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి. దీంతో కార్యాలయాలకు వినియోగదారులు వస్తే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుసటి రోజు వచ్చిన వారికి అధికారులు సకాలంలో కలవడానికి సమయం ఇవ్వకపోవడంతో వినియోగదారులకు నిరీక్షణ తప్పడంలేదు. పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పెరిగిన విద్యుత్ కనెక్షన్లను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు విరుద్దంగా అధికారులు వ్యవహరిస్తుడడంతో విద్యుత్ సమస్యలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఎంత సేపు వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన కొత్త కనెక్షన్ల మంజూరులో కొందరు ఏడీఇ, ఏఇలు లంచాలను దండుకుంటూ యమబిజీగా ఉంటూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో సరఫరాలో అంతరయాలు ఏర్పడుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో కరెంట్ పోయిందంటే సకాలంలో కరెంట్ రావడం లేదు. కరెంట్ సరఫరాలో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు నిత్యం అనేక అవస్థలకు గురవుతున్నారు. వ్యాపార సముదాయాలకు ఓ విధంగా డొమెస్టిక్ వినియోగదారులకు మరో విధంగా సరఫరా చేస్తూ విద్యుత్ అధికారులు తమ ధ్వందనీతిని ప్రదర్శిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో కరెంట్ హై,లో ఓల్టేజీలతో కరెంట్ సరఫరా అవుతుండడంతో విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ఇంట్లోని టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు కాలిపోతున్నాయి. అనేక ప్రాం తాల్లో ఎన్నో ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు నేటికి దర్శనమి స్తున్నాయి. ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారినప్పటికీ మామూళ్ళపైనే ద్యాస తప్ప ఈ సమస్యను పట్టించుకోవడంలేదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**హద్దులు దాటిన ఓ ఇద్దరి అవినీతి..**
రాజేంద్రనగర్, కందుకూర్ డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఇద్దరు అధికారులు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. అక్రమ సంపాదనకు అలవాటుపడిన సదరు అధికారులు డీఇ కార్యాలయాల్లో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన ప్రతి చోట కూడా ఇలాగే వ్యవహరించినట్లు సదరు అధికారులపై విమర్శలు ఉన్నాయి. ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకపోవడంతోపాటు పాలన గాడితప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు వినియోగదారులను దోచుకోవడమే త మ విధి అన్నట్లుగా ఇష్టారాజ్యంగా దోచుకకుంటున్నారని బాహాటంగానే విమర్శ లు వినిపిస్తున్నాయి. డీఇ కార్యాలయాలతోపాటు ఏడీఇ, ఏఇ కార్యాలయాల్లో పనిచేసే పై స్థాయి నుంచి కిందిస్థాయి వరకు రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు వసూలు చేస్తున్న అవినీతి సొమ్మును అంతా కలిసి పంచుకుంటున్నట్లు తెలిసింది. డీఇ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## బసవతారకంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

-నివాళులర్పించిన చైర్మన్ నందమూరి బాలకృష్ణ



తల్లిదండ్రులు ఎన్టీఆర్–బసవతారకం విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తున్న చైర్మన్ బాలకృష్ణ

**హైదరాబాద్, మే 28,ప్రభాతవార్త:**
స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 101 జయంతిని పురస్కరించుకుని మంగళవారం బసవతారకం ఇండోఅమెరికన్ ఆసుపత్రిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చైర్మన్ నందమూరి బాలకృష్ణ హాజరై హాస్పిటల్ ఆవరణలోని తమ తల్లిదండ్రుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం హాస్పిటల్‌లో క్యాన్సర్‌పై పోరాడుతూ చికిత్స పొందుతున్న చిన్నారులకు పండ్లు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా బసవతారకం ఆసుపత్రి ముందుకు సాగుతుందన్నారు. ఎందో పేదలకు క్యాన్సర్‌పై పోరాటంలో బాసటగా నిలుస్తుందన్నారు. తన తల్లిదండ్రులు ఆశించినట్లు అందుబాటైన ధరలలో ప్రపంచస్థాయి క్యాన్సర్ చికిత్స అందిచడంలో దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు ఎంపి నామానాగేశ్వర్‌రావు, జెఎస్ ఆర్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డా.టిఎస్‌రావు, మెడికల్ సూపరిండెంట్ డా.ఫణికోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, మే 28 ప్రభాతవార్త :** మానసిక ఒత్తిడి,తీవ్రమనోవేదనతో బాధపడుతున్న ఓ సాఫ్‌వేర్ ఉద్యోగిని తాను నివాసముంటున్న ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గత కొన్నేళ్లుగా తీవ్ర మనోవేదనతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్రటం ఘజియాబాద్ జిల్లా శిల్పాసన్ సిటీలో నివాసముండే జయప్రకాశ్ పలివాల్ కుమార్తె నీతూ పలివాల్(42) నగరంలోని విప్రో సంస్థలో ఐటీ ఉద్యోగినిగా పనిచేస్తూ గచ్చిబౌలిలోని టీఎన్జీవో కాలనీలో నివాసముంటున్నారు కాగా గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మనోవేదనతో బాధపడుతన్న నీతూ చికికత్సను కూడా తీసుకుంటుంది. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి 9:30గంటల ప్రాంతంలో నీతూ తాను నివాసమంటున్న ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా నగరంలోనే నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ, మియాపూర్‌లో నివాసముంటున్న నీతూ సోదరుడు సాయి సురభ పలివాల్ తన సోదరికి ఫోన్ చేయగా ఎంతకూ స్పందించలేదు. దీంతో నీతూ నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లగా నీతూ ఇంటి తలుపులు గడియవేసి ఉంది. ఇంటి యజమానులను పిలిచి తలుపులు బద్దలు కొట్టి చూడగా నీతూ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటం కనిపించింది. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా నీతూకు వివాహం జరుగకపోవడం,మానసిక వ్యాధితో బాధపడుతుండటమే ఆమె ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలానగర్‌లో గంజాయి పట్టివేత...మహిళ అరెస్ట్

**హైదరాబాద్, మే28, ప్రభాతవార్త:**



పోలీసుల అదుపులో మహిళా డ్రగ్ స్మగ్లర్ షేక్ జామీన్‌బీ

బాలానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహిళను ఎస్‌ఎఫ్‌టీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏకంగా ఇంటి నుంచే ఆమె గంజాయిని సరఫరా చేస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్‌ఎఫ్‌టీ ఎస్.ఐ బీ.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం, షేక్ జామీన్ బీ అనే మహిళ బాలానగర్ ప్రాంతంలోని ఫతేనగర్‌లో నివాసముంటోంది. ఐతే గత కొంత కాలంగా ఆమె గుట్టు చప్పుడు కాకుండా ఇంటి నుంచే గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది. ఒక గంజాయి ప్యాకెట్ రూ.300 కు, అంతకంటే ఎక్కువ మోతాదులో ఉన్నది రూ.500కి విక్రయిస్తోంది. మొత్తంగా కిలో గంజాయి రూ.6వేలకు పురానాపూల్ ప్రాంతం నుంచి కొనుగోలు చేసిన ఆమె, వేరు వేరు ప్యాకెట్లుగా గంజాయిని విడదీసి కిలో రూ.10వేలకు తగ్గకుండా విక్రయిస్తోంది. ఈ మేరకు నిందితురాలు పోలీసుల దర్యాప్తులో చెప్పింది. విశ్వనీయ సమాచారం అందడంతో గంజాయి విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి, సీజ్ చేసిన గంజాయితో పాటు నిందితురాలిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

## తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

**బేగంపేట మే 28,ప్రభాతవార్త**
తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగలు చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను ఎస్సార్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుడి నుంచి 2లక్షల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటనపై ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి,డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ జానకి రాములు వివరాలను తెలియజేసారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడిపత్రి సమీపంలోని శ్రీరాములు పేటకు చెందిన వాయులు వారి బాలగోవింద్(22),ఉదయం సమయంలో వీధులలో తిరుగుతూ చెత్త ,చిత్తు కాగితాలు ఏరుకుంటున్నట్లు ఉంటూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తాడు.రాత్రి పూట ఆ ఇళ్లను టార్గెట్ చేసి ఇంటి తాళాలు పగుల గొట్టి చోరీలకు పాల్పడేవాడు.గత సంవత్సరం తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడి బంగారు,వెండి,ఆభరణాలు,నగదు చోరీ చేసాడు.అక్కడి నుంచి రెండు నెలల క్రితం నగరానికి వచ్చి దాసారం బస్తీలో నివాసం ఉంటున్నాడు.ఈ సంవత్సరం ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు.చోరీ చేసిన సొత్తును దాసారం బస్తీ గుడిసెల్లోనే ఉంటున్న పి.సుంకప్ప (36),పి.సురేందర్(25)లకు అప్పగిస్తుంటాడు.వారు చోరీ సొత్తును అమ్మిసొమ్ము చేస్తుంటారు.కొంత చోరీ సొత్తును సనత్‌నగర్ లో పాన్ బ్రోకర్ వ్యాపారం చేస్తున్న అశోక్‌కుమార్ జైన్ వద్ద తాకట్టు పెట్టారు.ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న ఎస్సార్‌నగర్ క్రైం పోలీసు బృందం విశ్వసనీయ సమాచారం మేరకు బాలగోవింద్‌తో పాటు సుంకప్ప,సురేందర్‌లను దాసారం బస్తీలో అరెస్ట్ చేసారు.చోరీ సొత్తు తాకట్టు పెట్టుకున్న అశోక్ కుమార్ జైన్ ను కూడా పోలీసులు అరెస్ట్ చేసారు.నిందితుల నుంచి రూ 2లక్షల విలువ చేసే 30వతులాల వెండి వస్తువులు,2తులాల బంగారు ఆభరణాలు,రూ 2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సిఎం వ్యవహారాల ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి సత్కరించిన : దరిపల్లిచ చంద్రం

**సిద్దిపేట రూరల్, మే 28, ప్రభాతవార్త :** సిఎం వ్యవహారాల ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదారాబాద్‌లో మంగళవారం టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డిని దరిపల్లి చంద్రం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులను అడ్డుకుంటుందని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని వేం నరేందర్‌రెడ్డి సూచించినట్లు దరిపల్లి చంద్రం తెలిపారు. అభివృద్ధి పనుల లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపినట్లు తెలిపారు. సిద్దిపేటలో ఎలాంటి అభివృద్ధి పనులు నిలిచిపోవని అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పినట్లు వివరించారు. పార్టీ కోసం కష్ట కాలంలో కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఈ యేడు ఎల్లమ్మ దయతో పాడి పంటలు బాగా పండి

రైతులు సుభిక్షంగా ఉండాలి :ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్: చక్రధర్‌గౌడ్

**చిన్నకోడూరు, మే 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం సిద్దిపేట ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఈ యేడు ఎల్లమ్మ దయతో పాడి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలన్నారు. అలయాభివృద్ధికి రూ.51 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చక్రధర్‌గౌడ్‌ను గౌడ సంఘం ప్రతినిధులు శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు భూపేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, మల్లేశం గౌడ్, శంకర్, రాజయ్య తదితరులు ఉన్నారు. కాగా జిల్లాలోని దూళ్‌మిట్ట మండలం జాలపల్లి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్దోగంలో చక్రధర్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అశీస్సులు తీసుకున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు .. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

మండల వ్యవసాయ అధికారి కె.శంకర్

**నారాయణఖేడ్, మే 28 ప్రభాతవార్త:** ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆయా రకాల నాణ్యమైన విత్తనాలను రైతులు ఫర్టిలైజరు షాపుల్లో తీసుకోవాలని నారాయణఖేడ్ మండల వ్యవసాయ అధికారి కె.శంకర్ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో రైతులకు ఆయా రకాల విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపైన అవగాహన కల్పించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న కాటన్ బీజీ 2 విత్తనాలను ప్రభుత్వం నుంచి ముద్ర కలిగిన సర్టిఫైడ్ విత్తనాలను మాత్రమే రైతులు గమనించి కొనుగోలు చేయాలని అన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే అవసరమైన విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే ఫర్టిలైజర్ దుకాణం నుంచి రశీదును తీసుకోవాలని అన్నారు. అట్టి రశీదును పంట కోత సమయంన అయ్యేంత వరకు రైతులు రశీదును భద్రపర్చుకోవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి దూర ప్రాంతాల నుంచి తెచ్చిన ఆయా రకాల విత్తనాలను తీసుకుని మోసపోవద్దన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని ఆయా ఫర్టిలైజర్ డీలర్లు కూడా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని అన్నారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే ప్రభుత్వం నుంచి చట్టపరమైన చర్యలు తప్ప వన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణధికారి రాందాస్, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలు

**నారాయణఖేడ్, మే 28 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలో వెంకటాద్రి నిలయంలో జయంతి వేడుకలు ఆయన అభిమానులు అర్థం విశ్వనాథ్,ఎస్. మోహన్‌రెడి,నర్వ ప్రశాంత్, జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అరిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలోనే నూతనంగా మండలాలు ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌దే అన్నారు . భారత రత్న అవార్డును కూడా ప్రకటించాలని వారన్నారు. ఆయన హయంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.ఎస్ ఏజెన్సీ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు జనుము విత్తనాల పంపిణి

**పుల్కల్, మే 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పుల్కల్‌లో మంగళవారం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణి చేశారు. మండలానికి సరఫరా అయిన 6వందల క్వింటాళ్ల జీలుగ, 80 క్వింటాళ్ల జనుము విత్తనాలను గ్రామంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో చౌటకూరులోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు విత్తనాలను అందచేశారు. మరో రెండు రోజులు రైతులకు విత్తనాలను అందచేస్తామని వ్యవసాయ అధికారులు ప్రకటించారు.

## చౌటకూరులో మహిళ శక్తి కుట్టు కేంద్రం ప్రారంభం

**చౌటకూరు, మే 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో మంగళవారం మహిళ శక్తి కుట్టు కేంద్రాన్ని డిపిఎం జయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపిఎం జయశ్రీ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రతి మహిళ శ్రీ శక్తి కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చౌటకూరుతో పాటు మండలంలోని గంగోజిపేటలో సైతం కేంద్రాన్ని నిర్వహిస్తారన్నారు. డ్వాక్రా గ్రూపు సంఘాలలో కట్టు మిషన్ ఉన్న వారు అవకాశాన్ని వినియోగించుకుని ప్రయోజనం పొందాలని వివరించారు. శిక్షణ పొందిన మహిళలకు నిరంతరం పనులు చేసుకునే అవకాశం ఉంటుందని, ఫలితంగా ఆర్థికంగా స్థిరపడగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఏపిఎం శివలక్ష్మి, సిఏ సావిత్రి, శోభ, విఓలు సునీత, పుష్పమ్మ, లక్ష్మి, చంద్రకళ, ప్రతిభ, జ్యోతి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సంజీవరెడ్డికి కేబినెట్‌లో చోటు కల్పించాలి

-యూత్ కాంగ్రెస్ నాయకులు బిరాదాస్ దత్తు

**మనూర్, మే 28, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి త్వరలో విస్తరించే కేబినెట్‌లో అవకాశం కల్పించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు దోసపల్లి బిరాదార్ దత్తు వినతి చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఒక మారు కూడ మంత్రి దక్కలేదని, విద్యావంతుడైన సంజీవరెడ్డికి మంత్రి పదవి కట్టబెట్టాలని సూచించారు.

## సంజీవరెడ్డిని కేబినెట్‌లో చేర్చుకోవాలి

-యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు శంకరమ్మ

**నారాయణఖేడ్ టౌన్, మే 28, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి త్వరలో విస్తరించబోయే రాష్ట్ర కేబినెట్‌లో చేర్చుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి రాజు శంకరమ్మ వినతి చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్కరు మంత్రి పదవిని పొందలేదని గుర్తు చేశారు. వెనుకబడిన నియోజకవర్గానికి మంత్రి పదవి కట్టబడితే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని, అందుకు సంజీవరెడ్డికి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని బి రాజు శంకరమ్మ వినతి చేశారు.

## బోల్తా పడిన బైక్-వ్యక్తి మృతి

**పుల్కల్, మే 28, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కోడూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కోడూరు గ్రామానికి చెందిన మంగళి వీరేశలింగం (45) సోమవారం అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై ముత్తంగి నుంచి కోడూరుకు వస్తున్న క్రమంలో శివంపేట గ్రామ శివారులో సైకిల్ మోటారు అదుపు తప్పి జాతీయ రహదాపి పక్కలో గల బీడియం గుంతలో బోల్తాపడిందన్నారు. ప్రమాదంలో మంగళి వీరేశలింగం అక్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి భార్య మంగలి సంధ్యారాణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించిన అధికారులు

-నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**న్యాల్‌కల్, మే 28, ప్రభాతవార్త:** నిబంధనలు అతిక్రమించి రైతులను దగా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామనాయుడు, మండల వ్యవసాయ అధికారిణి లావణ్యలు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్, మండలంలోని చాల్కి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య, ఎస్ఐ రామనాయుడులు దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రశీదులు అందచేయాలన్నారు. విత్తనాలు ఎంఆర్‌పి రేటుకు మంచి నగదు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు దుకాణల్లో కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదును అందుకుని పంట దిగుబడి వచ్చే వరకు రశీదులను అంటిపెట్టుకోవాలని ఎఓ లావణ్య, ఎస్ఐ రామనాయుడులు మండల రైతులకు సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట, మే 28, ప్రభాతవార్త: ఈ నెల 29వ తారీఖున మిన్పూర్ 132 కెవిలో మరమ్మత్తు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకరించాలని అధికారులు వినతి చేశారు.

## జూన్ 5లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

-అధికారులతో జిల్లా విద్యాధికారి రాధా కిషన్

**పాపన్నపేట, మే 28, ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు జూన్ 5వ తారీఖు లోగా పూర్తి అయ్యేలా చూడలని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడిచాన్‌పల్లి, అరికెల, తమ్మాయిపల్లి, లక్ష్మీనగర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను డిఈఓ రాధా కిషన్ పరిశీలించారు. డిఈఓ వెంట మండల విద్యాధికారి నీలకంఠం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**చేర్యాల,మే28,ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను చేర్యాల పట్టణంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఏల శ్రీనివాస్,పట్టణాధ్యక్షులు మిట్టపల్లి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగ నిర్వహించారు.కార్యక్రమంలో నంగి శ్రీరాములు,మధుసాగర్ గౌడ్,పాము శివలింగం,ఎండి.ఎక్బాల్,సురేష్,పిల్లి రవి,తివారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం అభినందనీయం

**తాండూరు, మే 28, ప్రభాతవార్త :** అన్నదానం అభినందనీయమని తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు సామాజాక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర యూత్ సెక్రెటరీ రొంపల్లి సంతోష్‌కుమార్ ఆద్వర్యంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి సంఘం సంయుక్తంగా దాతల సహకారంతో పట్టణంలోని చించోళి రోడ్డు మార్గంలోని మల్లప్పమడిగ సమీపంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయా

-మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**మర్కుక్, మే 28 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వర్ధరాజ్‌పూర్‌లో వర్ధరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయా అని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సోమవారం వర్ధరాజ్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్ వర్ధరాజస్వామి దేవాలయ అర్చకులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను తన వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. గత మూడు రోజులుగా వర్ధరాజస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించగా ఆదివారంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదంతో పాటు శాలువాను మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఆలయ పునర్నిర్మాణం కోసం మంజూరుచేసిన నిధులతో పనులు పూర్తి పూర్తికాలేదని, ఇంకా 30 శాతం పనులు జరగాల్సి ఉందని కెసిఆర్‌కు తెలుపగా త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు చేసి పనులను పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కెసిఆర్‌ను కలిసిన వారిలో ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

## అగ్నిప్రమాదంలో లక్ష రూపాయల గడ్డి దగ్ధం

**జోగిపేట, మే28, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయల విలువ చేసే గడ్డివాములు దగ్ధమయ్యాయి. జోగిపేటకు చెందిన పాత గోశాలలో గోవులకోసం ఇటీవలే తీసుకువచ్చిన గడ్డిని నిల్వ చేశారు. గోవులకు మేత నిమిత్తం ఉంచిన ఈ గడ్డి మంగళవరంనాడు జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగ దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి సమాచారం అందుకున్న ఫైర్‌ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

## అత్యధిక మెజారిటీతో మెదక్ ఎంపీ స్థానాన్ని గెలుస్తాం

-కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు

గుమ్మడిదల, మే28 ప్రభాతవార్త: గుమ్మడిదల మండల కేంద్రంలో స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు పాల్గొని గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీసుసలతో నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తల సహకారంతో గెలిచి ప్రజలకు కావలసిన సదుపాయాలను సమకూర్చే విధంగా కేంద్రంతో పోరాడి సాధించి తీరుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, మాజీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డి, మాజీ ఉప సర్పంచి మూడుచింతల నరేందర్‌రెడ్డి, తిరుమలవాసు, మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్, తుడుం శ్రీనివాస్, కావాలి శంకర్, గ్యారాల మల్లేష్, నీరుడి రమేష్, కుమ్మరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి లక్ష్మాపూర్‌లో మానిక్‌ప్రభు జాతర ఉత్సవాలు

**పెద్దశంకరంపేట, మే28 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీ మానిక్ ప్రభు 32వ వార్షికోత్సవ జాతర ఉత్సవాలను ఈ నెల 29వ తేదీ నుండి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29న బుధవారం స్వామి వారికి అభిషేకాలు, బోనాలు, 30న గురువారం బండ్ల ఊరేగింపు, రాత్రి సూర్యచంద్రులన ఆటకం, 31న శుక్రవారం కుస్తీ పోటీలు, అన్నదానం, జూన్ 1న శనివారం మానిక్ ప్రభు పల్లకి సేవ, 2న పాచి బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా వేద బ్రహ్మణ పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాతర ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో సాల్గొన్న మండల బీజేపీ అధ్యక్షులు దయాకర్‌గౌడ్

**కొల్చారం, మే28 ప్రభాతవార్త:** కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలో మంగళవారం నిర్వహిం చిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో మండల బీజేపీ అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ యువకులు శశాంక్‌రెడ్డి, సామిత్‌రెడ్డిలు మండల బీజేపీ అధ్యక్షులు దయాకర్‌గౌడర్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి గుండునాని, సంగాయిపేట బూత్ అధ్యక్షులు ఆంజనేయులు, నందు, బీజేపీ నాయకులు రామకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులను పరామర్శించిన ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**కొల్చారం, మే28 ప్రభాతవార్త:** కొల్చారం మండలం పైతర, కోనాపూర్, తుక్కాపూర్ గ్రామాల్లో గత వారం కురిసిన వర్షాలకు మొలకెత్తిన, ప్రమాదవశాత్తు కాలిపోయిన వరి ధాన్యాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్‌కుమార్, ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులకు భరోసా కల్పించారు. అంతకుముందు రంగంపేట, తుక్కాపూర్, పైతర గ్రామాల్లో గాలి బీభత్సానికి ఇంటి పైకప్పులు కూలిన బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, సకాలంలో తూకం వేయకపోవడంతో ధాన్య తడిసి మొలకెత్తిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మండల యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, యూత్ ఐకాన్ రవితేజారెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, దొడ్ల ఆంజనేయులు, సోమ నర్సింలు, చిట్యాల యాదయ్య, ఎలుక గంగయ్య తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

జిల్లా గ్రందాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

**నర్సాపూర్ మే, 28. ప్రభాతవార్త :** ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులుకు లేదని జిల్లా గ్రంథాలయాల సంస్త మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. నర్సాపూర్‌లోజిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్,వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్ లు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ మాట్లాడుతూ మోసపూరిత మైన హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు 420 హామీలలో ఏ ఒక్క హామీకూడ అమలు చేయలేదన్నారు.ప్రజలతో రైతులతో యువకులతో ఓట్లేయించుకొని హామీలు అమలు చేయకుండా మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని దుయ్యబట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్‌నియోజకవర్గంలో ప్రజలు ఓటుతో ఓడించి ఎమ్మెల్యే గా సునీతారెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. సునీతారెడ్డి ద్రోహి అయితే ప్రజలు ఎమ్మెల్యేగా ఎందుకు గెలిపిస్తారని ప్రశ్నించారు. ప్రజలందరు గమనిస్తున్నారు ఎవ్వరుద్రోహి అనేది అన్నారు.నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సునీతారెడ్డిని ప్రజలద్రోహి, రైతుల ద్రోహి అయితే ఎందకు ఎమ్మెల్యేగా పట్టం గట్టారని అన్నారు.నర్సాపూర్ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎమ్మెలేగా ఉన్న సునీతారెడ్డి ని విమర్శించే స్థాయి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ కు, కాంగ్రెస్ నర్సాపూర్‌నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లకు లేదన్నారు. మీ స్థాయిని బట్టి మాట్లాడటం నేర్చుకోవాలని మాతవు పలికారు.నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. గతంలో భూకబ్జాలు, మట్టి మాపియాలు చేసిన వారందరు మీ వెంటనే ఉన్నారని అన్నారు.కాంగ్రెస్ నాయకులు వ్యక్తి గత విమర్శలు మానుకొని నైతిక విలువలతో కూడిన రాజకీయం చేయాలని అన్నారు.లేని పక్షంలో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పడానికి వెనుకాడేది లేదని వెల్లడించారు.ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉంటుందని దానికి అనుకూలంగా నడుచుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తు ఊరుకోమని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలోజిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్,వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్ లతో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్,బిఆర్ఎస్‌కెవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేశం,కౌన్సిలర్ రాంచందర్, బిఆర్ఎస్ నాయకులు నాగరాజుగౌడ్, సూరారం నర్సింలు, షేక్ హుస్సెన్, ఆంజనేయులుగౌడ్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూమి కాజేయాలన్న ఉద్దేశ్యంతో అత్యాయత్నం చేసినఇద్దరి నిందితుల రిమాండ్ : ఏసీపీ జి.మధు

**సిద్దిపేట రూరల్, మే 28, ప్రభాతవార్త :** భూమి కాజేయాలన్న ఉద్దేశ్యంతో అత్యాయత్నం చేసిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపారు. మంగళవారం అయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం వడ్డెర కాలనీకి చెందిన అలకుంట అశోక్(డిప్యూటి తహాశీల్దార్ సిద్దిపేట అర్డీఓ అఫీస్), అలకుంట మహేందర్‌లు కరీంనగర్‌కు చెందిన నసీంఖాన్ అతని తమ్ముడు అతీఫ్‌లపై అత్యాయత్నం చేశారని తెలిపారు. వడ్డెర కాలనీ సమీపంలో నసీంఖాన్ అత్తమ్మ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతుందని తన తమ్ముడు అతీఫ్‌తో కలిసి వచ్చి భూమి దగ్గరికి వెళ్లి చూస్తుండగా అశోక్, మహేందర్‌లు నానా బూతులు తిట్టి కిందపడేసి బండరాళ్లతో తలపై కొట్టి చంపే ప్రయత్నం చేశారని తెలిపారు. మహేందర్ కొంత మంది వ్యక్తులను ఇన్నోవాకారులో కొంత మందిని తీసుకొని వచ్చి కత్తితో చంపే ప్రయత్నం చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలకుంట మహేందర్‌పై పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే 7 కేసులు ఉన్నాయని అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. మహేందర్ గత కొంత కాలంగా సిద్దిపేట పట్టణంలో పలు భూ కబ్జాలకు పాల్పడ్డాడని తెలిసిందని వాటిపై కూడా విచారణ జరిపి పూర్తి వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు.

## షాద్‌నగర్‌లో గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**షాద్‌నగర్, మే 28, (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుట్కా ప్యాకెట్లను నిషేదించడంతో మంగళవారం షాద్‌నగర్‌లో సీఐ ప్రతాపలింగం ఆధ్వర్యంలో రైడ్ నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం రెండు లక్షల విలువ గల గుట్కా, తంబాకు ప్యాకెట్లు స్వాదినం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సం దర్భం గా వారు మాట్లాడుతూ... ఎవరైనా గుట్కా, తం బాకు లాంటివి విక్రయిస్తూ చట్ట వ్యతిరేకంగా వ్య వహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరు గుతుందని అన్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా, తంబాకులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**పూడూరు, మే 28, ప్రభాతవార్త :** జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.పూడూరు మం డలం పరిధిలోని అంగడి చిట్టంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహాకారసంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ఉన్నతాధికారులతో చర్చించి ముగిసిన కొనుగోలు కేంద్రం వ్యవధిని వారంరోజుపాటు పొడిగించామని వివరించారు.రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటాలు జొన్నలకు రూ.3180గా మద్దత్తు ధరను నిర్ణయించిందని వివరించారు.ఇట్టి సదవకాశాన్ని ప్రతిఒక్కరైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిఏసిఎస్ చైర్మన్ పి సతీష్‌రెడ్డి,జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు కడుమూరు ఆనందం,పటోళ్ల రఘునాథ్‌రెడ్డి,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటయ్య పాల్గొన్నారు.

## నర్సాపూర్ రాయరావు చెరువును పర్యాటక కేంద్రంగా మార్పునకు కృషి : మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్ మే, 28. ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువును ఆత్యాధునిర హంగులతో ఒక పర్యాటక కేంద్రంగా మార్పునకు కృషి చేస్తామని నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని రాయరావు చెరువుపరిసరా ప్రాంతాలను ఆయన సందర్శించి పకిశీలించారు.ఈ సందర్భంగా మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రాయరావు చెరువును ప్లాస్టిక్ కాలుష్య రహిత పర్యావరణ అనుకూలంగా ఒక పర్యాటక కేంద్రంగా మార్పు చేస్తామని అన్నారు.ఇందుకు గాను పర్యాటక కేంద్రంగా మార్పుచేయుటకు చేపట్టవల్సిన పనుల విషయమై చర్చించి చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు. సలహాలను ఇవ్వడం జరిగింది.అంతేగాక రాయరావు చెరువు వద్ద మత్యకారులతో మాట్లాడి చేపలు పట్టె సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు తర్వాత వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించుటకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డులో నున్న ఆధునిక హంగులతో సకల సదుపాయాలతో నిర్మిస్తున్న స్మశాన వాటిక పనులను, కొత్త గా నిర్మిస్తున్న మాడ్రన్ దోభీఘాట్ నిర్మాణ పనులను మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పరిశీలించారు. ఈ పనులను నాణ్యమైనదిగా ఉండాలని తెంటనే పనులను పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ పట్టణ నాయకులు, మున్సిఫల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం కొనుగోలు చేసి న్యాయం చేయండి

బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్‌మల్లేష్‌గౌడ్

**నర్సాపూర్ మే, 28. ప్రభాతవార్త :** రైతుల ఆరుగాలం పండించిన ధాన్యం ను వెంటను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయండని బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ కోరారు. మంగళవారం నర్సాపూర్ మార్కెట్ యార్డులో నర్సాపూర్‌మండలం సీతారాంపూర్ , లాలుతండాల కు చెందిన రైతులు రెండు నెలలుగా ఈ మార్కెట్ యార్డులో ధాన్యం ను ఉంచినా ఇప్పటి వరకు కొననుగోలు చేయక పోవడంవల్ల అట్టి దాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయిపొయింది. ఈ విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ రైతులకు అండగా నిలబడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేసిందని అన్నారు.అంతేగాక నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఈసమస్యలపై స్పందించి మీరైనా రైతుల సమస్యలను పరిష్కరించాలని తడిసిన ధాన్యాన్ని, కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డిని వాల్దాసన మల్లేష్‌గౌడ్ కోరారు.

## జూన్ 5 వరకు సివిల్‌వర్క్స్ పనులు పూర్తి చేయాలి : డిఈవో రాధాకిషన్

**నర్సాపూర్ మే, 28. ప్రభాతవార్త :** అమ్మఆదర్శ పాఠశాలలోసివిల్ వర్క్స్ పనులు జూన్ 5 వరకుపూర్తి చేయాలని డిఈవో రాధాకిషన్ సూచించారు. నర్సాపూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాలల సివిల్ వర్క్స్ పై రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఆదర్శ పాఠశాలల సివిల్ వర్క్స్ పనులు జూన్ 5 వరకు పూర్తి చేయాలని ఉపాద్యాయులకు సూచించారు. ఈ సివిల్ వర్క్స్ పనులు పూర్తయిన తర్వాత పేయింటింగ్ పనులను పూర్తి చేసి జూన్12 వరకు అమ్మ ఆదర్శ పాఠశాలలను ప్రారంబించవల్సిఉంటుందని తెలిపారు. ఈమేరకు ఉపాధ్యాయులు పట్టుదలతో ఈ అమ్మఆదర్శ పాఠశాలల పనులు వెంటనే పూర్తి చేయాలని డిఈవో రాధాకిషనన సూచించారు. ఈకార్యక్రమంలో డిఈవో రాధాకిషన్ తో పాటు ఎంఈవో బుచ్యానాయక్, తారాసింగ్ ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులను విమర్శించడం సరికాదు

**నర్సాపూర్ మే, 28. ప్రభాతవార్త :** బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేషం, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ లు అన్నారు.మంగళవారం కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పై ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. దీంతో బిఆర్ఎస్ ను ప్రజలు వద్దనుకొని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 ట్యారంటీల హామీలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారుఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీల హామీలను ఇప్పటి వరకు 4 గ్యారంటీలు అమలు చేసిందని, ఇంకా రెండు గ్యారంటీలు వెంటనే అమలు చేయడం జరుగుతందన్నారు. దీంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై లేని పోని విమర్శలు చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ఎంతగానో కృషి చేసి కాంగ్రెస్ పార్టీని భలోపేతంచేడం. ప్రజల సమస్యలను పరిస్కారం చేశారని అన్నారు. కాగా బిఆర్ఎస్ నాయకులు ఆంజ.నేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి ల పై వ్యక్తి గత విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేషం, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ ల తో పాటు ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ ఎంపిపి లు లలితనర్సింగ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మండల మహిళ అధ్యక్షురాలు వినోద, ఎంపిటీసి అశోక్, మండల ఓబిసి సెల్ అధ్యక్షుక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్,మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్,మైనార్టీ మండల అధ్యక్షులు అజ్మత్, నాయకులు యాదాగౌడ్, దేవిసింగ్,శ్రీశైలంయాదవ్, మల్లేష్‌యాదవ్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లిలో హోరా హోరిగా సాగిన కుస్తీ పోటీలు

**టేక్మాల్, మే 28 ప్రభాతవార్త:** బొడ్మట్‌పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లోన భాగంగా వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలకు నారాయణఖెడ్, నిజామాబాద్, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుంచి మల్లయోదులు తరలి వచ్చారు. కొబ్బరి కాయ కుస్తీ మొదలు కొని పది తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. కడెం పోటీలో లాతుర్‌కు చెందిన అభిజిత్ గెలుపొందాడు. బొడ్మట్‌పల్లి కంకర సంగయ్య పది తులాల వెండి కడెంను అందజేశారు. ఈ జాతరలో ఏలాంటి అవంఛనీయ సంఘటన చోటు చేసుకొకుండా టేక్మాల్ ఎస్ఐ మురళి, పోలీస్ సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్ పాటిల్, గ్రామ సంఘాల నాయకుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

## నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : ఏఓ రాం ప్రసాద్

**టేక్మాల్, మే 28 ప్రభాతవార్త:** నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టేక్మాల్ మండల ఎఓ రాం ప్రసాద్ అన్నారు. మంగళవారం టేక్మాల్ పర్టిలేజర్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలి విత్తనాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని వ్యాపారులు నకిలి విత్తనాలు అమ్మితే పిడియక్ట్ కేసుతో కూడిన చర్యలు తప్పవన్నారు. ఈయన వెంట టేక్మాల్ యస్ఐ మురళీ ఉన్నారు.

## ఆందోళన వద్దు-అందుబాటులో విత్తనాలు

**కంది, మే 28, ప్రభాతవార్త:** రైతులు జీలుగ, జనుము విత్తనాల కొరకు ఆందోళన పడాల్సిన అసవరం లేదని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన కందిలోన సొసైటీ వద్ద మంగళవారం రైతులు విత్తనాల కొరకు ఆందోళన చేయగా ఏఓ ప్రసాద్ స్పందిస్తూ మండలానికి రావాల్సిన జీలుగ, జనుము విత్తనాలు ఎన్నికల కోడ్ ఉండటంతో విత్తనాల లోడ్ మండలానికి రావడానికి అలస్యం అవుతుందన్నారు. మండలానికి 50 క్వింటాళ్ల జనుము, 200 క్వింటాల్ల జీలుగ విత్తనాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 80 క్వింటాళ్ల జీలుగ, 50 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులకు సరఫరా చేశామన్నారు. 2 రోజుల్లో రైతులకు అవసరమైన విత్తనాలను పంపిణి చేస్తామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ సూచించారు.

## దామరగిద్దను సందర్శించిన డిపిఓ

**నాగల్‌గిద్ద, మే 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దామరగిద్దను జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా మంగళవారం సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని, వైకుంఠధామాన్ని, డంపింగ్ యార్డు, నర్సరీలను పరిశీలించారు. నర్సరీల ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని పంచాయితీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను డిపిఓ ఆదేశించారు.

## ఆనందోత్సవాలతో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జహీరాబాద్/న్యాల్‌కల్, మే 28, ప్రభాతవార్త:** ఒక చోట చదువుకుని వేరు వేరు ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు పదేళ్ల తరువాత ఒక చోట కలుసుకుని ఆనందోత్సవాలతోఉ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నియోజకవర్గంలోని మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. నాడు విద్యా బోధన ఉపాధ్యాయులు ప్రభాకర్, బుచ్చయ్య, సంజీవరావు, చంద్రశేఖర్, రాములు, కిషన్, ఎన్కతల నర్సింహారెడ్డిలను కార్యక్రమానికి ఆహ్వానించి శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. దశాబ్ద కాలంగా ఎవరెక్కడ ఉన్నారో, ఏఏం పనులు చేస్తున్నారో, కుటుంబ పరిస్థితులపై ఒకరితో ఒకరు చర్చించుకుని రోజంతా కులాసాగా గడిపారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులకు నాగు పాఠాలో బోధించి స్వర్గస్థులైన ఉపాధ్యాయులను, తమతో చదువుకుని కీర్తి శేషులైన విద్యార్థులకు నివాళులు అర్పించి, అక్షర స్వరూపిణి సరస్వతి మాతకు పూజా కార్యక్రమాలు నిర్వహించి సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కులాసాగా భోజనాలు అరగించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మడపతి రామయ్యస్వామి, ఎంకె కుసురుద్దీన్, కే యాదయ్య, బి నరసింహులు, అన్వర్, బిక్షపతి, ఆర్ గీత కిష్టయ్య, సంజీవరావు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## సోనియాగాంధీ రుణం తీర్చుకునే బాధ్యత తెలంగాణ ప్రజలది : ఎమ్మెల్యే శంకర్

**నదింగామ, మే 28, ప్రభాతవార్త** తెలంగాణ తల్లుల కడుపు కోత ఆపాలని వారి పిల్లలు బాగుండాలని తెలంగాణలోని ప్రజలు ఆశలు ఆశయాలు నెరవేర్చి రాష్ట్రం లోని 80శాతం మంది బడుగు బలహీన వర్గాల ప్రజల బతుకులు బాగుపడాలని రాహుల్‌గాంధీ రాజకీయ భవిష్యత్తును పక్కనపెట్టి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ స్పష్టం చేశారు. వచ్చే నెల రెండవ తేదీ రాష్ట్రఅవతరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న ఉద్యమకారులను గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాలు లాంటి ఎన్నో ఆశయాలతో తెలంగాణ సాధించుకుంటే మాజీ సిఎం కేసిఆర్ దొంగల పాలు చేశారని రాష్ట్రాన్ని ల్యాండ్ మాఫియా ఇసుక లిక్కర్ చేనేత మాఫీయలు కొనసాగాయని గత బిఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ సర్కార్లుఓ కేసిఆర్ నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టు కాదది రాష్ట్ర ప్రజల పాలిట శనేశ్వరంగా తయారయిందని ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ కేంద్రం లో బిజెపి ఒకటేనన్నారు. వచ్చేనెల రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సంలో భాగంగా ఉద్యమకారులను గౌరవించి సోనియా గాంధీ రుణం తీర్చుకుందాం అన్నారు.